భయపెడుతున్న బైక్ రేసింగ్స్

- పలువురిపై కేసు నమోదు.. బైక్‌లు సీజ్
- అయినా.. తీరు మార్చుకోని రేసర్లు

రాయదుర్గం,జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఐటీ కారిడార్‌లో ఆకతాయిలు నిర్వహించే బైక్‌స్టంట్స్, కట్స్, బైక్ రైడ్‌లతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. శని, ఆదివారాలు వచ్చాయంటే రాయదుర్గం ఐటీ కారిడార్‌లోని టీహబ్ పరిసర ప్రాంతాల్లో బైక్‌రైడర్లు గుంపులుగుంపులుగా వచ్చి రద్దీ సమయాల్లోనే బైక్‌స్టంట్స్, రేసింగ్‌లు చేస్తూ ప్రజలను, వాహనదారులను హడలెత్తిస్తున్నారు. 15 రోజుల క్రితం రాయదుర్గం పోలీసులు రాత్రి సమయంలో బైక్‌రేసింగ్ చేస్తున్న సుమారు 50 మందిని అదుపులోకి తీసుకున్నారు. బైక్‌లను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. అయినప్పటికీ ఆకతాయిలు రెచ్చిపోతూ మళ్లీ బైక్‌రేస్‌లు, స్టంట్‌లు చేస్తూ ప్రజలను హడలెత్తిస్తున్నారు. శనివారం రాత్రి రోడ్డు సందడిగా ఉన్న సమయంలోనే రెచ్చిపోయారు. బైక్‌టైర్లపై పెట్రోల్‌పోసి మంటలు అంటిస్తూ రేసింగ్‌లు నిర్వహించారు. దీంతో ఒక్కసారిగా ప్రజలు భయంతో పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ వెంకన్న ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆరుగురు బైక్‌రైడర్స్‌ను అదుపులోకి తీసుకున్నారు. బైక్‌లను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. అలాగే, బంజారాహిల్స్ తాజ్ హోటల్ వద్ద బైక్‌పై వెళ్తున్న సీనియర్ జర్నలిస్ట్‌ను అతివేగంతో దూసుకెళ్లిన గుర్తు తెలియని కారు ఢీకొట్టడంతో కాలు విరిగింది. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి బైక్‌రేస్‌లు, స్టంట్స్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


ఐటీ కారిడార్‌లో బైక్‌రేసర్ల హల్‌చల్


ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం ఇస్తున్న శ్రీసాయిహిల్స్‌వాసులు

మాదకద్రవ్యాల నివారణకు కృషి

వివేకానందనగర్‌కాలనీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ డివిజన్ గోకుల్‌ప్లాట్స్‌లోని శ్రీసాయిహిల్స్ ప్లాట్స్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని సప్తగిరికాలనీలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాలనీలోని బడ్డీకొట్లలో విచ్చలవిడిగా మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాలు, గంజాయి, గుట్కాలు విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయని తెలిపారు. దీంతో ఆయా ప్రాంతాలకు చెందిన యువకులు పెద్దఎత్తున కాలనీకి రోడ్లపై మత్తు పదార్థాలు సేవిస్తూ అల్లర్లు సృష్టిస్తున్నారని కాలనీవాసులు వినతిపత్రంలో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే గాంధీ వెంటనే పోలీసు ఉన్నతాధికారులతో చర్చించి, మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాల విక్రయాలకు అడ్డుకట్ట వేసేలా కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు.


పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తదితరులు

దైవచింతనతోనే మానసిక ప్రశాంతత

జీడిమెట్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): దైవచింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. సుభాష్‌నగర్ డివిజన్ రామ్‌రెడ్డినగర్‌లోని లక్ష్మీగణపతి ఆలయంలో నిర్వహించిన వాసవి కన్యకా పరమేశ్వరి దేవి నవగ్రహ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాస్, బాలరాజ్ గుప్తా, వామన్‌గుప్తా, చంద్రమౌళిగుప్తా, గోవింద్ పాల్గొన్నారు.

- **ఆలయాలతో..**

పేట్‌బషీరాబాద్: ఆలయాల్లో ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్‌లోని అయోధ్యనగర్‌లోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో నిర్వహించిన వార్షికోత్సవానికి ఆయన హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేను కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నదీమ్‌రాయ్, ఏసు, విశ్వకర్మ సంఘం సభ్యులు బ్రహ్మయ్య, కృష్ణ, నారాయణ, బాబు, రమేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎమ్మెల్సీ

దుండిగల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నానని మేడ్చల్ బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలు బస్తీలు, కాలనీల వాసులు స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో ఆదివారం కలిశారు. అనంతరం స్పందించిన ఎమ్మెల్సీ సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రజల సమస్యలను పరిష్కరించాలని వారికి సూచించారు.


శంభీపూర్ రాజును కలిసిన కాలనీ ప్రజలు



యోగాతో అదుపులో మధుమేహం

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): భారతీయ యోగా సంస్థాన్ ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ ఏడో ఫేజ్ జీహెచ్‌ఎంసీ ఉచిత మధుమేహ నియంత్రణ క్యాంప్ ఆదివారంతో ముగిసింది. మధుమేహం అనేది వయస్సుతో సంబంధం లేకుండా వస్తుందని, దీనిని యోగా చేస్తూ ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకుంటే సరిపోతుందని, దీనిని వ్యాధిగా చూడకూడదన్నారు. సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు యదుకృష్ణ, జిల్లా అధ్యక్షుడు సాంబశివరావు, జోనల్ అధ్యక్షుడు రమేష్‌బాబు, అంజిబాబు, సెంటర్ ఇన్‌చార్జిలు శిరీష, శశిదేవి తదితరులు పాల్గొన్నారు.

కళలను నేటి తరానికి తెలియజేయాలి

పేట్‌బషీరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సంగీత కళలను నేటి తరానికి తెలియజేయవలసిన బాధ్యత అందరిపైనా ఉందని ఆదర్శనగర్ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు ఎ.శంకరయ్య అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్‌లోని ఆదర్శనగర్ ఆడిటోరియంలో శ్రీదేవి సంగీత నృత్యనికేతన్ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై ప్రతిభ కనబరిచిన చిన్నారులను సన్మానించి, మెమొంటోలు అందజేశారు. నాట్యాచారిని జి.అచ్యుతాంబ శిక్షణలో ఎంతోమంది చిన్నారులకు నాట్యకళను అందించిందని, పదిహేను సంవత్సరాలుగా చిన్నారులకు సంగీతంతో శిక్షణ ఇవ్వడంతో పాటూ పండుగ దినాల్లో ఆలయాల్లో నాట్య ప్రదర్శనలు ఇస్తారని ఆయన అన్నారు. పిల్లల తల్లిదండ్రులు అందజేసిన రూ.5 వేలను శ్రీదేవి సంగీత నృత్య నికేతన సభ్యులకు అందజేశారు.


చిన్నారులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎ.శంకరయ్య

భవిష్యత్ కోసం ప్రకృతిని కాపాడాలి

హైదర్‌నగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అంబర్ చెరువు వాకర్స్ అసోసియేషన్, షూట్ టు ఫైన్ ప్రొడక్షన్ ఆధ్వర్యంలో చెరువు పరిసరాల సుందరీకరణలో భాగం గా ఆదివారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు, స్థానికులతో కలిసి చెరువు ప్రాంతాల్లో చెత్త తొలగించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో భాగంగా షూట్ టు ఫైన్ ప్రొడక్షన్ ఫైట్‌మాస్టర్లు రామ్‌లక్ష్మణ్ సహకారంతో మనం మారిపోదాం అనే ఎకో ఫ్రెండ్లీ సాంగ్‌ను చిత్రీకరించారు. శివరాజ్‌గౌడ్, నరసింహులు, సిద్దయ్య, నరసింహ, గిరి, గోపి, మాస్టర్ వన్నెస్, సతీష్, రామచందర్, నవీన్, మాధవ్, వాసు, కృష్ణ సాంబశివరావు, అశోక్, శ్రీదేవి పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

- **మొక్కలు నాటి పరిరక్షించాలి**

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ గోపనపల్లి గ్రామంలోని స్కైవుడ్స్ గేటెడ్ కమ్యూనిటీలో ఏర్పాటు చేసిన హరితహారం కార్యక్రమంలో శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై స్థానికులతో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు విరివిగా మొక్కలు నాటి పరిరక్షించాలని అన్నారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలంటే మొక్కలు పాత్ర కీలకమన్నారు.


సిల్పథాన్ ఈవెంట్‌లో పాల్గొన్న స్థానికులు

శిల్పబృందావన్‌లో సిల్పథాన్

హైదర్‌నగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ శిల్పా బృందావన్ కాలనీ సభ్యుల వార్షిక సిల్పథాన్ ఈవెంట్ ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమం అశ్విని క్లినిక్, ఇంటిగ్రిన్, ఇన్సర్, వీఈసీ, సైలోటెక్, డాక్టర్ అబ్దుల్ కలాం స్కూల్, ఆప్తా సింథసిస్ వంటి సంస్థలు నిర్వహించాయి. ఈ సందర్భంగా 5 కే, 10 కే రన్‌లో స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. రన్ పూర్తిచేసిన వారికి నిర్వాహకులు పతకాలు అందజేశారు.

ద ఫ్యాక్టరీ-వై, ఇండో యూరో సింక్రోనైజేషన్ మధ్య ఒప్పందం

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ద ఫ్యాక్టరీ-వై, ఇండో యూరో సింక్రోనైజేషన్(ఐఈఎస్) మధ్యన భాగస్వామ్య ఒప్పందం కుదిరింది. ద ఫాక్టరీ-వై వ్యవస్థాపకులు ఫిలిస్ అస్మస్, ఇండో యూరో సింక్రోనైజేషన్ ప్రెసిడెంట్, ఎండీ రాజ్ వంగపాడు శనివారం టీ హబ్-2లో సంతకాలు చేశారు. ఈ రెండు సంస్థలు ఇచ్చిపుచ్చుకునే సాంకేతిక సహకారంతో సీబీఏఏఎస్ (కంపనీ బిల్డింగ్ అస్ ఏ సర్వీసెస్) గ్లోబల్ ఇన్నోవేషన్‌ను ప్రోత్సహించేందుకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. దేశవ్యాప్తంగా వ్యవస్థాపక ప్రయత్నాలను ప్రోత్సహించే లక్ష్యంతో ద ఫ్యాక్టరీ-వై, ఐఈఎస్ మధ్య కుదిరిన వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం సంచలనాత్మక ఆలోచనలు అభివృద్ధి చేసేందుకు ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

బాలానగర్: తెలంగాణ ముస్లిం మైనారిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫతేనగర్ డివిజన్ మాధవీనగర్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ యం.డి ఖాజ పర్యవేక్షణలో చేపట్టిన వైద్య శిబిరంలో మల్లారెడ్డి ఆసుపత్రి వైద్య సిబ్బంది రోగులకు షుగర్, బీపీ, చర్మ, గుండె సంబంధింత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

అర్హులైన పేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వాలి: సీపీఐ

బాలానగర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు చేసిన హామీలన్నింటిని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని సీపీఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి.కృష్ణ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం బాలానగర్ డివిజన్ శ్రీశ్రీనగర్ సీపీఐ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ సభ్యుల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన వారికి ఇళ్లస్థలాలు, రేషన్ కార్డులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ శ్రీశ్రీనగర్ కార్యదర్శి మనోహర్, కౌన్సిల్ సభ్యులు దావీద్, రాములు, ఎండి ఎక్బాల్, కృష్ణచారి, మహిళా నాయకురాలు చంద్రమ్మ, ఉమారాణి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణ

ఇంటర్నేషనల్ మెజరర్స్ క్లినిక్ పూర్తి

అల్వాల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఈఎంఈ సెయిలింగ్ అసోసియేషన్ భారతదేశంలో మొదటి సారిగా సెయిలింగ్‌కు సంబంధించి సెయిలర్స్ పోటీల్లో ఎంత దూరం ప్రయాణించాలి అనే అంశంపై ఇంటర్నేషనల్ మెజరర్స్ క్లినిక్‌ను విజయవంతంగా పూర్తి చేసినట్లు ఎంసీఈఎంఈ కమాండెంట్, లెఫ్టినెంట్ జనరల్ నీరజ్‌వర్షనే తెలిపారు. ఆదివారం ఇంటర్నేషనల్ మెజరర్స్ క్లినిక్ కార్యక్రమంలో ఈఎంఈ సెయిలింగ్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి ఆయన మాట్లాడారు. త్వరలో హుస్సేన్‌సాగర్‌లో నిర్వహించనున్న అంతర్జాతీయ సెమినార్ పోటీలకు సంబంధించి రెండురోజులుగా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ డియాజ్ మార్గదర్శకత్వంలో అంతర్జాతీయ ప్రతినిధి ఇవాన్‌తో సహా 18 మంది ఇంటర్నేషనల్ మెజరర్స్ క్లినిక్‌లో పాల్గొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా సెయిలర్స్ ఎన్నిరౌండ్లు, పొడువు, అడ్డం ఎంత దూరం సెయిలింగ్ చేయాలనే అంశంపై కొలతను వెల్లడించారు.


ఈఎంఈ సెయిలింగ్ అసోసియేషన్ ప్రతినిధులతో చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ డియాజ్

బాలిక హత్య కేసులో నిందితులను శిక్షించాలి

మియాపూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ నడిగడ్డతండాలో ఈనెల 7న అదృశ్యమైన చిన్నారి హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాలు ఆదివారం డిమాండ్ చేశాయి. నడిగడ్డతండా నుంచి మియాపూర్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వరకు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బాలిక మృతికి సంఘీభావంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌డీడబ్ల్యూ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి అంగడి పుష్ప మాట్లాడుతూ.. అదృశ్యమైన బాలిక హత్యకు గురికావడం పలు అనుమానాలకు కలుగుతున్నాయని అన్నారు. చిన్నారి మృతికి కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దేవనూర్ లక్ష్మి, నాయకులు మురళీ, తాండ్ర కళావతి, జయలక్ష్మి, శివాని, లలిత, ఈశ్వరమ్మ, విమల, కల్యాణిబాయి, వీరమని బాయి, కమల బాయి. శ్వేత బాయి పలువురు పాల్గొన్నారు.


కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు

భక్తులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు: కూన

గాజులరామారం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ ప్రజలపై చిత్తారమ్మదేవి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నా రు. గాజులరామారం చిత్తారమ్మ ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో నిర్మించిన నూతన షెడ్డును ఆలయ కమిటీ సభ్యులతో కలిసి శ్రీశైలంగౌడ్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగ కుండా ఆలయ కమిటీ సభ్యులు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కేకెఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ అంతయ్యగౌడ్, ఇంద్రసేన గుప్త, శ్రీనివాస్‌గౌడ్, సత్తెయ్య, శ్రీరాములు, నర్సింహ, బాలరాజు పాల్గొన్నారు.


నూతన షెడ్డును ప్రారంభిస్తున్న కూన శ్రీశైలంగౌడ్


మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న హన్మంత్‌రెడ్డి

చెరువులు, కుంటలను కాపాడాలి

దుండిగల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): చెరువులు, కుంటలను కాపాడాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి కలిసి వివరించారు. గత ప్రభుత్వంలో చెరువులు, కుంటలు కబ్జాకు గురయ్యాయని, వాటిని కాపాడి భూ ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని చెరువులు కాపాడకుంటే రాబోయే రోజుల్లో ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని మంత్రికి వివరించారు. కార్యక్రమంలో గణేశ్, జితేందర్ పాల్గొన్నారు.

మిత్రాహిల్స్ పార్కును కాపాడాలి

హైదర్‌నగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మిత్రాహిల్స్ పార్కును కాపాడాలని సీతారామరాజు ఆధ్వర్యంలో అసోసియేషన్‌వాసులు ఆదివారం శేరిలింగంపల్లి బీజేపీ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్‌కు ఫిర్యాదు చేశారు. మిత్రాహిల్స్ సర్వేనెంబర్ 65లో ఉన్న పార్కు శిథిలావస్థకు చేరుకుంటుందని, ఈ పార్కుపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని కాలనీవాసులు రవికుమార్‌కు వివరించారు. దీనికి స్పందించిన ఆయన త్వరలో పార్కును క్లీన్ చేయించి కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో సుబ్బారావు, భరత్, మహేందర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.